సాక్షి
నాగర్‌కర్నూల్
శనివారం। 25। నవంబర్। 2023



కిక్కిరిసిన కురుమూర్తి గిరులు

కురుమూర్తిస్వామి ఉత్సవాలకు వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలివస్తున్నారు.

వివరాలు 8లో ▸



పాలిటెక్నిక్‌ క్రీడలు ప్రారంభం

పాలమూరు పాలిటెక్నిక్‌ కళాశాల మైదానంలో ఉమ్మడి జిల్లా క్రీడలు ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.8 /17.6

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై చిరు జల్లులు కురవచ్చు. రాత్రి చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్‌

సేల్స్‌టాక్స్‌ అధికారుల తనిఖీ

- ట్రాన్స్‌పోర్టు లారీలు పోలీస్‌స్టేషన్‌కు తరలింపు



నాగర్‌కర్నూల్‌ క్రైం: జిల్లా కేంద్రంలోని ఓ డెయిలీ ట్రాన్స్‌పోర్టులో పెద్దమొత్తంలో చీరలు వచ్చాయనే అనుమానంతో సేల్స్‌టాక్స్‌ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో డెయిలీ ట్రాన్స్‌పోర్టుకు సంబంధించిన రెండు లారీలను స్థానిక పోలీస్‌స్టేషన్లకు తరలించి ఎన్నికల స్క్వాడ్‌ సమక్షంలో దుస్తుల దుకాణాలకు సంబంధించిన దాదాపుగా రూ.4 లక్షల విలువ చేసే చీరలను పరిశీలించారు. దుస్తుల దుకాణాల యజమానులు చీరలకు సంబంధించిన బిల్లును తీసుకొచ్చి సేల్స్‌టాక్స్‌, ఎన్నికల స్క్వాడ్‌ అధికారులకు చూయించి చీరలను తీసుకెళ్లారు. సేల్స్‌ టాక్స్‌ అధికారులు ట్రాన్స్‌పోర్టు కంపెనీ తనిఖీ చేసే సమయంలో ట్రాన్స్‌పోర్టు కంపెనీ సిబ్బందితో పాటు దుస్తుల దుకాణాల యజమానులు చాలాసేపటి వరకు సరిగా స్పందించకపోవడంతో రెండు లారీలను అధికారులు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లాల్సి వచ్చింది. కాగా ఓ రాజకీయపార్టీ రెండు రోజుల్లో మహిళ వికాసం కార్యక్రమాన్ని నిర్వహించనుందని చీరలు ఎన్నికల్లో పంపిణీ చేసేందుకు తీసుకొచ్చారనే సమాచారం వైరల్‌ కావడంతో పాటు ఒకేసారి పెద్దమొత్తంలో చీరలు రావడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



ఆత్మకూర్‌: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఆర్జేడీ వెంకట నర్సమ్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలకిష్టాపూర్‌ కేజీబీవీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న బోధనపై ఆరా తీశారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు ఉన్నతి కార్యక్రమం, పదోతరగతి విద్యార్థులకు లక్ష్య కార్యక్రమం ద్వారా ప్రత్యేక బోధన చేపడుతున్నామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు రాబట్టాలని, ఉపాధ్యాయులు మారుతున్న లక్ష్యాలకు అనుగుణంగా బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌సింగ్‌, జీహెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఓ శివలీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడా నేతల ఆగమనం

- నేడు కొల్లాపూర్‌లో, రేపు మక్తల్‌లో హోంమంత్రి అమిత్‌షా పర్యటన
- 27న కోస్గిలో ప్రియాంకగాంధీ సభ
- రేపు మక్తల్‌లో కర్ణాటక సీఎం, కల్వకుర్తి, మహబూబ్‌నగర్‌లో యూపీ సీఎం సభలు
- ప్రచారానికి మిగిలింది నాలుగు రోజులే



సాక్షి, నాగర్‌కర్నూల్‌: ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా ప్రధాన పార్టీల ముఖ్యనేతలతో అభ్యర్థుల ప్రచారం హోరెత్తింది. ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్‌, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బహిరంగసభలను నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని వేడెక్కించారు. శనివారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కొల్లాపూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావుకు మద్దతుగా నిర్వ హించనున్న బహిరంగసభలో పాల్గొననున్నారు. ఈనెల 27న నారాయణపేట జిల్లా కోస్గిలో నిర్వహించనున్న కాంగ్రెస్‌ బహిరంగసభలో ఆ పార్టీ అగ్రనేత ప్రియాంకగాంధీ హాజరు కానున్నారు. ఎన్నికల ప్రచారానికి మరో నాలుగు రోజులు మాత్రమే గడువు మిగిలి ఉన్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఆయాపార్టీల అగ్రనేతల పర్యటనలతో ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరుకోనుంది.

■ కాంగ్రెస్‌ పార్టీ అగ్రనేత రాహుల్‌ గాంధీ ఉమ్మడి జిల్లాలోని కొల్లాపూర్‌, కల్వకుర్తి, జడ్చర్ల, షాద్‌నగర్‌ నియోజకవర్గ కేంద్రాల్లో పర్యటించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇప్పటికే అలంపూర్‌, వనపర్తి, నాగర్‌కర్నూల్‌, అచ్చంపేట, కొడంగల్‌ బహిరంగసభల్లో పాల్గొన్నారు. అలాగే కర్ణాటక రాష్ట్ర మంత్రులు, ఏఐసీసీ కార్యదర్శులు, పార్టీ పరిశీలకులతో ప్రచారం ఊపందుకుంది. ఈ నెల 27న కోస్గి పట్టణ శివారులో నిర్వహించే సభలో ప్రియాంకగాంధీ పాల్గొననున్నారు. ఆదివారం మక్తల్‌లో కర్ణాటక సీఎం సిద్దరామయ్య ప్రచారం చేయనున్నారు.

■ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి అభ్యర్థులకు ఈనెల 28 వరకే గడువు ఉంది. సమయం దగ్గరపడుతుండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్‌ మొదలైంది. మిగిలిన కాస్త సమయంలోనే ఎక్కువ మంది ఓటర్లను ప్రసన్నం చేసుకునేలా అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఇంటి నుంచి బయలుదేరుతున్న అభ్యర్థులు రాత్రి 10 గంటల వరకు నిరాటంకంగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఆ తర్వాత ముఖ్యమైన నేతలు, కార్యకర్తలతో తదుపరి కార్యాచరణపై మంతనాలు సాగిస్తున్నారు. మిగిలిన నాలుగు రోజుల్లోనూ ప్రధాన పార్టీల సభలు, సమావేశాలతో ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించనున్నారు.

బీజేపీ జనాకర్షణ మంత్రం..

ఉమ్మడి జిల్లాలో బాగా కలిసొచ్చే నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున బహిరంగసభల నిర్వహణకు బీజేపీ సిద్ధమైంది. ఇందుకోసం కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను రంగంలోకి దింపుతోంది. గత నెలలోనే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగసభలో పాల్గొని ఆ పార్టీలో ఉత్సాహాన్ని నింపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నారాయణపేటలో పర్యటించగా, కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ ఇటీవల కొల్లాపూర్‌లో ప్రచారం చేపట్టారు. ఇటీవల గద్వాలలో పర్యటించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మరోసారి రానున్నారు. శనివారం కొల్లాపూర్‌లో, ఆదివారం మక్తల్‌ నియోజకవర్గాల్లో ఆయన పర్యటించనున్నారు. ఈ నెల 26న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ మహబూబ్‌నగర్‌తో పాటు కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లులో నిర్వహించే బహిరంగసభలో పాల్గొననున్నారు.

పాలమూరును చుట్టేసిన సీఎం కేసీఆర్‌

ఎన్నికల షెడ్యూల్‌ వెలువడిన నాటి నుంచి ఉమ్మడి పాలమూరు జిల్లాపై సీఎం కేసీఆర్‌ ప్రత్యేకంగా దృష్టిసారించారు. షాద్‌నగర్‌ మినహా అన్ని నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించి పాలమూరును చుట్టేశారు. ఈ నెల 27న షాద్‌నగర్‌లో సభ జరగనుంది. బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ మక్తల్‌లో రోడ్‌షో నిర్వహించగా.. పలువురు మంత్రులు అడపాదడపా జిల్లాలో పర్యటిస్తున్నారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకం

నాగర్‌కర్నూల్‌: జిల్లా పరిధిలోని సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాల్లో ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర ఎంతో కీలకమని, నాగర్‌కర్నూల్‌, కొల్లాపూర్‌, అచ్చంపేట నియోజకవర్గాల కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు సతీష్‌ కుమార్‌, మితిలీష్‌ మిశ్రాలు అన్నారు. కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో శుక్రవారం మైక్రో అబ్జర్వర్లకు ఓటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్‌ సాధారణ పరిశీలకులు మితిలీష్‌ మిశ్రా మాట్లాడారు. పోలింగ్‌ రోజు పోలింగ్‌ కేంద్రాల్లో ప్రతి అంశాన్ని పరిశీలిస్తూ.. ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేయాలన్నారు. జిల్లాలోని 210 సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లను ఎన్నికల సంఘం నియమించిందన్నారు. పోలింగ్‌ రోజున ఉదయం 5.30కి మాక్‌ పోలింగ్‌ నిర్వహణ అలాగే మాక్‌ పోలింగ్‌ 50 ఓట్లు వేశారా లేదా పరిశీలన చేయాలని సూచించారు. పోలింగ్‌ ఉదయం 7 గంటలకే ప్రారంభం కావాలని ఏదైనా కారణాలతో ఉదయం 8 గంటల వరకు కూడా వెంటనే తమకు తెలియజేయాలన్నారు. ఏదైనా పోలింగ్‌ కేంద్రాల్లో ఉదయం 9 గంటల వరకు పోలింగ్‌ ప్రక్రియ ప్రారంభం కాకుంటే ఆ పోలింగ్‌ కేంద్రాల్లో రీపోలింగ్‌ నిర్వహించాల్సి ఉంటుందన్నారు.



సమావేశంలో మట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు సతీష్‌ కుమార్‌, మిథిలేష్‌ మిశ్రా

- కొల్లాపూర్‌, అచ్చంపేట నియోజకవర్గాల మరో సాధారణ పరిశీలకులు సతీష్‌ కుమార్‌ మాట్లాడుతూ.. మైక్రో అబ్జర్వర్ల పోలింగ్‌ రోజున పోలింగ్‌ బూత్‌ లో జరిగే పోలింగ్‌ ప్రక్రియను పరిశీలన చేయడానికి నియమించడం జరుగుతుందని, బూత్‌లో ప్రతి అంశాన్ని పరిశీలన చేయాలని సూచించారు. ముఖ్యంగా ఈవీఎంలు సరిగా అనుసంధానం చేశారా, మాక్‌ పోలింగ్‌ తర్వాత క్లియర్‌ బటన్‌ నొక్కారా లేదా పరిశీలన చేయాలని సూచించారు. అనంతరం ఈవీఎంల నిర్వహణ పనితీరుపై ఈవీఎం ట్రైనర్‌ రాఘవేందర్‌ శిక్షణ ఇచ్చారు. శిక్షణ పర్యవేక్షణ నోడల్‌ అధికారి నర్సింగ్‌రావు, లీడ్‌ బ్యాంకు మేనేజర్‌ కౌశల్‌ కిషోర్‌ పాండే, మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్‌ ప్రక్రియ పూర్తి



మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్‌ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్‌ పి.ఉదయ్‌ కుమార్‌

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ పి. ఉదయ్‌ కుమార్‌

నాగర్‌కర్నూల్‌: ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఎన్నికల వ్యయ, సాధారణ పరిశీలకుల సమక్షంలో సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్‌ ప్రక్రియ పూర్తిచేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ పి.ఉదయ్‌ కుమార్‌ తెలియజేశారు. ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ.. శుక్రవారం కలెక్టరేట్‌లోని యస్‌.ఐ.సి. సమావేశ మందిరంలో అచ్చంపేట, కొల్లాపూర్‌ సాధారణ పరిశీలకులు సతీష్‌ కుమార్‌, జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు భేరా రామ చౌదరి పర్యవేక్షణలో జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌ కుమార్‌ పారదర్శకంగా ర్యాండమైజేషన్‌ ప్రక్రియ పూర్తిచేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కొన్ని సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాల పర్యవేక్షణకు మైక్రో అబ్జర్వర్లను కేటాయిస్తూ.. ర్యాండమైజేషన్‌ ద్వారా ఆయా నియోజకవర్గాలకు సూక్ష్మ పరిశీలకులను కేటాయించినట్లు తెలియజేశారు. నాగర్‌కర్నూల్‌ నియోజకవర్గానికి 43 మంది మైక్రో అబ్జర్లను, అచ్చంపేట నియోజకవర్గానికి 47 మంది మైక్రో అబ్జర్వర్లను, కొల్లాపూర్‌ నియోజకవర్గానికి 45 మంది మైక్రోఅబ్జర్వర్లను కేటాయించినట్లు తెలియజేశారు. సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్‌ పర్యవేక్షణలో పోలింగ్‌ ప్రక్రియ కొనసాగనున్నట్లు వివరించారు. అదనపు కలెక్టర్‌ కె.సీతారామారావు, ఈడీఎం నరేష్‌, ఎన్‌ఐసీ కోఆర్డినేటర్‌ హర్షద్‌ పాల్గొన్నారు.

1,621 మంది పోస్టల్‌ బ్యాలెట్ల వినియోగం

నాగర్‌కర్నూల్‌: దివ్యాంగులు, 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు ఆయా నియోజకవర్గాల్లో పోస్టల్‌ బ్యాలెట్‌ వినియోగంలో భాగంగా శుక్రవారం వరకు నాగర్‌కర్నూల్‌ నియోజకవర్గంలో 14 మంది వృద్ధులు, 19 మంది దివ్యాంగులు, అచ్చంపేటలో 45 మంది వృద్ధులు, 29 మంది దివ్యాంగులు, కొల్లాపూర్‌లో 26 మంది వృద్ధులు, 36 మంది దివ్యాంగులు పోస్టల్‌ బ్యాలెట్‌ వినియోగించుకున్నారని కలెక్టర్‌ తెలిపారు. జిల్లాలో మొత్తం 300 మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా.. శుక్రవారం వరకు మొత్తం 185 మంది ఓటు హ క్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా ఎన్నికల విధుల్లో భాగంగా ఎన్నికల సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగంలో భాగంగా శుక్రవారం వరకు నాగర్‌కర్నూల్‌ నియోజకవర్గం పరిధిలో 471 మంది, అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో 460, కొల్లాపూర్‌ నియోజకవర్గ పరిధిలో 301 మంది ఎన్నికల సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. జిల్లాలోని ఎన్నికల సిబ్బంది, ఇతర జిల్లా నియోజకవర్గాల్లో ఓటు హక్కు కలిగిన ఎన్నికల సిబ్బంది 204 మంది ఉద్యోగస్తులు తమ పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. హోం ఓటి ంగ్‌ ప్రక్రియ శనివారంతో ముగుస్తుందని, ఎన్నికల సిబ్బంది పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఈ నెల 28 వరకు వినియోగించుకునే అవకాశం ఉందని వివరించారు.

అభ్యర్థుల ఖర్చుల నమోదులో తేడా రావొద్దు

- ఎన్నికల వ్యయపరిశీలకుడు భేరా రామ్‌ చౌదరి

నాగర్‌కర్నూల్‌: జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రతి ఖర్చును లెక్కించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు భేరా రామ్‌ చౌదరి అన్నారు. శాసనసభ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఎమ్మెల్యే అభ్యర్థుల ఖర్చుల వివరాలపై ఎన్నికల వ్యయపరిశీలకుడు భేరా రామ చౌదరి రోజువారి అకౌంట్స్‌ రెండో విడత తనిఖీ పరిశీలించారు. శుక్రవారం కలెక్టరేట్‌ కార్యాలయంలో మొదటి అంతస్తు సమావేశ మందిరంలో వ్యయపరిశీలకుడు ఎమ్మెల్యే అభ్యర్థుల ఖర్చుల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించారు. నామినేషన్లు వేసిన రోజు నుంచి గురువారం వరకు అభ్యర్థులు ఖర్చు చేసిన వివరాలను ఆ పార్టీ ఏజెంట్ల వద్ద ఉన్న వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభ్యర్థుల ఖర్చుల నమోదులో తేడా రావొద్దని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చుల నమోదులో తేడాలు లేకుండా చూసుకోవాలని అకౌంట్‌ పరిశీలన అధికారులకు సూచించారు. అభ్యర్థుల అకౌంటు పుస్తకాలు, ఓచర్లు, బిల్లులను పరిశీలించారు. జిల్లా వ్యయ పర్యవేక్షణ కమిటీ ప్రత్యేక అధికారి శ్యాంబాబు, సహాయ వ్యయ నోడల్‌ అధికారి జహంగీర్‌ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు భేరా రామ్‌ చౌదరి

మూడోసారి ఆశీర్వదించండి



ప్రచారంలో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి మర్రి జనార్దన్‌ రెడ్డి

- ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌ రెడ్డి

బిజినేపల్లి: రాష్ట్రం వచ్చిన తర్వాత కందనూలు నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని, 2014, 2018లో ప్రతి గ్రామానికి ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు చేశానని, మరింత అభివృద్ధి చేయడానికి తనను మూడో సారి నాగర్‌కర్నూల్‌ ఎమ్మెల్యేగా గెలిపించాలని మర్రి జనార్దన్‌రెడ్డి వేడుకున్నారు. శుక్రవారం బిజినేపల్లి మండలంలోని పాలెం, గుడ్లనర్వ, ఖానాపూర్‌, బోయాపూర్‌ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్‌ ఆధ్వర్యంలో పాలెం గ్రామ ప్రజలు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి గజమాలతో ఘనస్వాగతం పలికారు. స్థానిక అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడారు. 2014 కంటే 2018 సంవత్సరంలో తనను భారీ మెజార్టీతో కందనూలు ప్రజలు గెలిపించారని, ఇప్పుడు అంతకన్న డబుల్‌ మెజార్టీతో గెలిపిస్తే డబుల్‌ అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే ప్రసంగం వింటున్న పాలెం గ్రామస్తులు

ట్రస్టు ద్వారా ఎన్నో సేవలు..

ఎంజేఆర్‌ ట్రస్టు ద్వారా బడులు, గుడులు ఇప్పటికే నిర్మించామని, పేదింటి ఆడ బిడ్డల పెళ్లిల్లు చేసి అన్నగా ఆదుకున్నానన్నారు. తిమ్మాజీపేట, సిర్సవాడలో ఎంజేఆర్‌ ట్రస్టు ద్వారా కార్పొరేట్‌ స్థాయిలో పాఠశాలలు నిర్మించానని, ఇలా ప్రతి మండల కేంద్రంలో కార్పొరేట్‌ స్థాయి పాఠశాలలను నిర్మిస్తామన్నారు. నాగర్‌కర్నూల్‌ జిల్లా కేంద్రంలో ధాన్యం అమ్ముకోవడానికి వచ్చిన రైతుల ఆకలి తీర్చడానికి రూ.5 భోజనం ఏర్పాటు చేశానన్నారు. తాను మరింత సేవ చేయాలనే ఉద్దేశంతో ట్రస్టు ద్వారా తన కష్టార్జితంతో సేవ చేస్తున్నానన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే..

కాంగ్రెస్‌ పార్టీకి ఓటు వేస్తే మళ్లీ కన్నీళ్లు కొని తెచ్చుకున్నట్లేనని, గ్యారంటీ లేని కాంగ్రెస్‌ పార్టీ గ్యారంటీలను ప్రజలు ఎవ్వరూ నమ్మరాదని సూచించారు. బీఆర్‌ఎస్‌ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కానీ భారీ మెజార్టీతో అఖండ విజయం ఇవ్వాలన్నారు. అలా ఇస్తే కేసీఆర్‌ బీమా ప్రతి ఇంటికి ధీమా పథకం కింద రూ.5 లక్షల పథకం అమలు చేస్తారని, సౌభాగ్యలక్ష్మి కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.3,000 జీవన భృతి అందజేస్తారని, ఆసరా పింఛన్ల కింద వృద్ధులకు రూ.5,016, దివ్యాంగులకు రూ.6,015 అందజేస్తారని వివరించారు. రైతబంధు పథకం కింద ఎకరాకు రూ.16,000 వరకు పెంచుతారని, వంట గ్యాస్‌ సిలిండర్‌ రూ.,400 అందజేస్తామన్నారు. అన్నపూర్ణ పథకం కింద తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తారన్నారు. ఆరోగ్య రక్ష పథకం కింద రూ.15 లక్షల వరకు పరిమితి పెంచుతానన్నారు.

కేఎల్‌ఐ కాల్వల్లో ముళ్ల చెట్లు..

కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో తీసిన కాల్వలో ముళ్లచెట్లు పేరుకుపోయాయి. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కాల్వల్లో నీళ్లు పారించి కందనూలును సస్యశ్యామలం చేయాలని నిర్ణయించుకుని ముందుగా కాల్వలో పెరిగిన ముళ్ల చెట్లను తొలగించి నీళ్లు పారించానన్నారు. ఇలా నియోజకవర్గంలో 80శాతం సాగుభూమికి రెండు పంటలకు సరిపడా నీళ్లు అందతున్నాయన్నారు. మిగిలిన 20శాతం సాగుభూమికి కూడా పాలమూర్‌– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద సాగు నీరు త్వరలోనే అందిస్తానన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వంలో కాల్వలో ముళ్లచెట్లు పెరిగితే బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం వచ్చాక ఆ కాల్వలో సాగునీరు పారిస్తున్నామన్నారు. తెలంగాణలో కేసీఆర్‌కు రైతుల కష్టం తెలుసని, అందుకే సాగునీటి ప్రాజెక్టులను పెద్దఎత్తున నిర్మించారన్నారు. తెలంగాణ రైతాంగానికి నాణ్యమైన 24 గంటల విద్యుత్తు కూడా అందిస్తున్నారన్నారు. ప్రజలు తెలంగాణ రాష్ట్ర సాధనకు ముందున్న ప్రభుత్వాల పనితీరును, ఆ తర్వాత వచ్చిన బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ పనితీరు ఎలా ఉందో ఆలోచించుకోవాలన్నారు.

బీఆర్‌ఎస్‌కు బిగ్‌ షాక్‌

- కాంగ్రెస్‌ గూటికి అలంపూర్‌ సిట్టింగ్‌ ఎమ్మెల్యే అబ్రహం



అలంపూర్‌: అలంపూర్‌లో బీఆర్‌ఎస్‌ పార్టీకి బిగ్‌ షాక్‌ తగిలింది. సిట్టింగ్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ అబ్రహం బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌ పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి, కాంగ్రెస్‌ అలంపూర్‌ అసెంబ్లీ అభ్యర్థి సంపత్‌ కుమార్‌, మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో శుక్రవారం సమావేశం అయ్యారు. అనంతరం సిట్టింగ్‌ ఎమ్మెల్యే అబ్రహంకు రేవంత్‌రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఇదిలాఉండగా, బీఆర్‌ఎస్‌ అధిష్ఠానం టికెట్ల కేటాయింపులో అలంపూర్‌కు సంబంధించి సిట్టింగ్‌ ఎమ్మెల్యే అయిన అబ్రహంను కాదని.. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మద్దతుదారుడైన విజయుడికి అవకాశం ఇచ్చింది. దీంతో నాటి నుంచి అబ్రహం అసంతృప్తితో ఉన్నారు. చివరకు పీసీసీ అధ్యక్షుడి సమక్షంలో బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతోపాటు జెడ్పీటీసీ సభ్యుడు రాజు, ఆర్డీఎస్‌ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్‌ తనగల సీతారామిరెడ్డి, నాయకులు కొంకల నాగేశ్వర్‌ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మద్దిలేటి, కొంగన రవి, రామనాయుడు, నీలలి శ్రీనివాస్‌, మధు నాయుడు, ఎర్రవల్లి రవి తదితరులు ఉన్నారు.

సిట్టింగ్‌ ఎమ్మెల్యే రావడం సంతోషం..

ప్రజా క్షేత్రంలో ప్రజలకు సేవ చేయడానికి సిట్టింగ్‌ ఎమ్మెల్యే కాంగ్రెస్‌ పార్టీలో చేరి తమతో కలిసి రావడం సంతోషంగా ఉందని ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్‌ అసెంబ్లీ అభ్యర్థి ఎస్‌ఏ సంపత్‌ కుమార్‌ అన్నారు. ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ.. డాక్టర్‌ అబ్రహంకు నియోజకవర్గంలో సౌమ్యుడిగా, రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవం ఉందన్నారు. ఆయన సేవలను పార్టీ సమర్థవంతంగా వినియోగించుకుంటుందని, విద్యావంతులు అబ్రహం బాటలో నియోజకవర్గ అభివృద్ధికి కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

- రీజినల్‌ మేనేజర్‌ శ్రీదేవి

నాగర్‌కర్నూల్‌ క్రైం: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు ఆర్టీసీకి ఆదాయం వచ్చేందుకు కృషి చేయాలని రీజినల్‌ మేనేజర్‌ శ్రీదేవి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో అవార్డు ఫంక్షన్‌ నిర్వహించి డిపోకు ఎక్కువ ఆదాయం తీసుకొచ్చిన డ్రైవర్లకు, కండక్టర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కురుమూర్తి జాతరకు నడిపిన స్పెషల్‌బసుల్లో నాగర్‌కర్నూల్‌ డిపో ఆదాయంలో 5వ స్థానంలో నిలిచిందని చెప్పారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలను చేర్చడంతో పాటు అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్‌ దేవరాజ్‌, డిపో డిప్యూటీ ఆర్‌ఎంఓ బాబునాయక్‌, శ్రీనివాస్‌ రెడ్డి, ఆంజనేయులు, వీఎస్‌ నారాయణ ఉన్నారు.



డ్రైవర్లకు, కండక్టర్లకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న రీజినల్‌ మేనేజర్‌ శ్రీదేవి

రాష్ట్రస్థాయి ప్రదర్శనలకు ఎంపిక



మట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

నాగర్‌కర్నూల్‌ క్రైం: జాతీయ బాలల సైన్స్‌ కాంగ్రెస్‌ జిల్లా స్థాయి పోటీలకు పాఠశాలకు ఒకరు చొప్పున 72 పాఠశాలలు పాల్గొనగా నాలుగు పాఠశాలలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు డీఈఓ గోవిందరాజులు తెలియజేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి ప్రాజెక్టు రిపోర్టులను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈఓ హాజరై మాట్లాడారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, అందుకోసం ప్రకృతిని అర్థం చేసుకుని ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత విద్యార్థులందరిపై ఉందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల వెన్నచర్ల విద్యార్థులు సురేష్‌, శివమణి రూపొందించిన ఆవు పేడ బూడిదతో ధాన్యం యొక్క నిల్వ సామర్థ్యం పెంచటం అనే ప్రాజెక్టు, జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల తిమ్మాజీపేట విద్యార్థులు సౌమ్య, కావ్య రూపొందించిన పాము కాటు నుంచి జాగ్రత్తలు అనే ప్రాజెక్టు, జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల పెద్దపల్లి విద్యార్థులు శ్రీవాణి, అంజలి రూపొందించిన వేప చెట్లకు వచ్చే డై బ్యాక్‌ వ్యాధి నివారణ ప్రాజెక్టు, కేకే రెడ్డి ఉన్నత పాఠశాల తెలకపల్లి విద్యార్థులు వర్షిత, స్నేహ రూపొందించిన సాంప్రదాయ పద్ధతుల ద్వారా మూత్రపిండ వ్యాధుల నివారణ ప్రాజెక్టు ఎంపికైనట్లు తెలియజేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. జిల్లా సైన్స్‌ అధికారి కృష్ణారెడ్డి, షర్ఫొద్దీన్‌, సురేష్‌ బాబు, నాగరాజు, అరుంధతి, శిరీష, రాములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతు పార్థివదేహం వైద్యకళాశాలకు అప్పగింత


బుచ్చయ్య(ఫైల్)

అమ్రాబాద్: మండల కేంద్రానికి చెందిన బుచ్చయ్య(62) రైతు శుక్రవారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు భార్య బుచ్చమ్మ, కుమారుడు బాల్‌నారాయణ, కుమార్తెలు భాగ్య, ప్రమీల ఉన్నారు. అయితే కుటుంబ సభ్యులు అందరూ కలిసి బుచ్చయ మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ వైద్యకళాశాలకు అప్పగించారు. బుచ్చయ్య మృతదేహం ఊరేగింపు అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులు వైద్యకళాశాలకు అప్పంగించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


బజారి(ఫైల్)

గట్టు: మండల పరిధిలోని గంగిమాన్‌దొడ్డికి చెందిన యువకుడు బజారి (23) శుక్రవారం కర్నూల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గంగిమాన్‌దొడ్డికి చెందిన బోయ ఈరన్న కుమారుడు బజారి యువ రైతు. అప్పుల బాధతో గురువారం వ్యవసాయ పొలం వద్ద గడ్డి మందు తాగాడు. విషయం తెలుసుకున్న చుట్టు పక్కల రైతులు బజారిని చికిత్స నిమిత్తం గట్టులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి అయిజకు అయిజ నుంచి కర్నూల్‌కు తరలించారు. కర్నూల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య మాధవి ఉన్నారు. వీరికి ఏడాదిన్నర కిందటే వివాహమైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో తండ్రి ఈరన్న రోదనలు మిన్నంటాయి. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ నందికర్, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపారు.

బైక్ చెట్టుకు ఢీకొని వ్యక్తి దుర్మరణం

జడ్చర్ల: మండలంలోని గొల్లపల్లి శివారులో శుక్రవారం రోడ్డు ప్రమాదంలో వడ్ల పాండాచారి(48) దుర్మరణం చెందాడు. మండలంలోని చిన్న ఆదిరాలకు చెందిన వడ్ల పాండాచారి బైక్‌పై గొల్లపల్లిలో ఉన్న తన కూతురు వద్దకు బయలుదేరాడు. లింగంపేట–గొల్లపల్లి ప్రధాన రహదారిపై బైక్ అదుపు తప్పి ఓ చెట్టును ఢీకొట్టాడు. ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో 15మందికి గాయాలు



బిజినేపల్లి: ఖిల్లాఘనపూర్ మండలం అప్పరెడ్డిపల్లిలో జరుగుతున్న వివాహానికి వెళ్తున్న ఒక వాహనం బోల్తా పడి 15 మందికి గాయాలు, ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుడ్లనర్వ గ్రామానికి చెందిన చంద్రకళ, బాలపీర్ దంపతుల కుమార్తె జ్యోతిని అప్పరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాగరాజుతో వివాహం నిశ్చయమైంది. పెళ్లి కూతురు బంధువులు, బీరువా, ఇతర వంట సామాగ్రిని తీసుకుని అప్పరెడ్డిపల్లి గ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో వెల్గొండ గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై వాహనం అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. అందులో ఉన్న 15 మందికి గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న స్థానికులు వారిని రక్షించి 108, ఇతర వాహనాల్లో నాగర్‌కర్నూల్ ఏరియాసుపత్రికి చికిత్స కోసం తరలించారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

జూరాలకు 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి 7గంటల వరకు ప్రాజెక్టుకు 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఆవిరి రూపంలో 111, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 390, కుడి కాల్వకు 361 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.721 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్ గ్రామ పంచాయతీ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ రమేశ్ తెలిపారు. మృతుడి వయస్సు 40 సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. నలుపురంగు చొక్కా, ప్యాంట్ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచామన్నారు. సంబంధిత వ్యక్తులు ఎవరైనా పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

బీజేపీతోనే బడుగులకు రాజ్యాధికారం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ


కల్వకుర్తిలో మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ. వేదికపై బీజేపీ అభ్యర్థి ఆచారి

కల్వకుర్తిరూరల్: బీజేపీతోనే బడుగులకు రాజ్యాధికారం లభిస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు నాటి నుంచి నేటి వరకు బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందని ద్రాక్షగానే మారిందన్నారు. ఈసారి బీజేపీ బీసీలకు ముఖ్యమంత్రి అవకాశం ఇస్తామని ప్రకటించిందని.. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు బీజేపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచినా, బీఆర్ఎస్ గెలిచినా మార్పు రాదని.. బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించిన బీజేపీతోనే మార్పు సాధ్యమన్నారు. మాదిగ రిజర్వేషన్ సమితి చేస్తున్న పోరాటాలకు ప్రధాని నరేంద్రమోదీ అండగా నిలిచి, ఎస్సీ వర్గీకరణకు స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. బీజేపీ అభ్యర్థి ఆచారి మాట్లాడుతూ 5సార్లు ఓటమిపాలైనా ఆరోసారి పోటీ చేస్తున్నానని తెలిపారు. తనను నమ్ముకున్న ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో పోటీలో ఉన్నానన్నారు. అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు.

మాదిగలను మోసం చేసే పార్టీలను తరిమికొట్టాలి

మక్తల్: మాదిగలను మోసం చేసే పార్టీలను తరిమికొట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. మక్తల్ పట్టణంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30ఏళ్లుగా ఉద్యమిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ, దివ్యాంగ, వృద్ధాప్య పింఛన్ల పెంపునకు పోరాటం సాగించామన్నారు. మాదిగలకు అండగా నిలిచే వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. 50ఏళ్లు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీకి ఎస్సీ వర్గీకరణ అంశంపై అనేక మార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం మాదిగలను మోసం చేస్తోందన్నారు. మాదిగలను ఓటుబ్యాంకుగా వాడుకొని మోసం చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో మార్పు రావాలంటే ప్రజలు బీజేపీకి మద్దతు ఇవ్వాలన్నారు. మక్తల్ బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుడిసె వెంకటయ్య, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, తిమ్మప్ప, విజయ్‌కుమార్, సురేష్, నర్సింహ, క్రిష్, నాగేష్, గడ్డం కృష్ణయ్య, హన్మంతు, వెంకటేష్ పాల్గొన్నారు.

కిక్కిరిసిన కురుమూర్తిగిరులు


క్యూలైన్‌లో భక్తుల బారులు

చిన్నచింతకుంట: పేదల తిరుపతి అమ్మాపురం కురుమూర్తిస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జాతరకు మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున అర్చకులు ఆలయ శుద్ధిచేసి సుప్రభాతసేవ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉద్దాల మండపం వద్ద స్వామివారి పాదుకలను దర్శించుకున్నారు. పలువురు భక్తులు మెట్లపై దీపాలు వెలిగిస్తూ స్వామివారి చెంతకు చేరుకొని మొక్కులు చెల్లించుకోవడం కనిపించింది. భక్తులతో పుష్కరిణి, అలువేలు మంగ, ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.

సిలిండర్‌తో తలపై బాది.. భార్యను హతమార్చిన భర్త

- న్యాయం చేయాలంటూ బంధువుల ఆందోళన


సువర్ణ (ఫైల్)

పెంట్లవెల్లి: భార్య తలపై సిలిండర్‌తో బాది భర్త హతమార్చిన ఘటన మండలంలోని జటప్రోల్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేష్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన యాదగిరికి కల్వకోల్‌కు చెందిన సువర్ణ (32)తో 10 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా హైదరాబాద్‌లో ఉంటూ జీవనం సాగించేవారు. భార్యాభర్తలు పలుమార్లు గొడవ పడగా పెద్దలు జోక్యం చేసుకొని సర్దిచెప్పారు. 5 నెలల కిందట సువర్ణ భర్తతో గొడవపడి పిల్లలతో కలిసి జటప్రోల్‌కు వచ్చి ఇక్కడే కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను పాఠశాలలకు పంపిస్తూ ఉండేది. శుక్రవారం తెల్లవారుజామున ఇంటికొచ్చిన యాదగిరి తన తమ్ముడికి పెళ్లి కాకుండా, కుటుంబం సంతోషంగా ఉండకూడదని చేతబడి చేయించావంటూ భార్యతో గొడవపడి చితకబాదాడు. చివరకు సిలిండర్‌తో తలపై బలంగా బాదడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయాన్ని పెద్ద కుమార్తె పోలీసులు, చుట్టుపక్కల వారికి తెలియజేసింది. అనంతరం యాదగిరి ఇద్దరు పిల్లలతో పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. ఠాణాకు చేరుకున్న బంధువులు పిల్లలకు న్యాయం చేయాలని, నేరస్తుడిని కఠినంగా శిక్షించాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఘటన స్థలాన్ని సీఐ యాలాద్రి, ఎస్‌ఐ సురేష్ పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

యాంటీ బయాటిక్స్‌తో దుష్ఫలితాలు


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైద్యులు

పాలమూరు: యాంటీ బయాటిక్స్ ఎక్కువగా వాడటం వల్ల దుష్ఫలితాలు ఉంటాయని జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ జీవన్ అన్నారు. ఈనెల 18నుంచి 24వరకు ప్రపంచ యాంటీ మైక్రోబయల్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం జనరల్ ఆస్పత్రిలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. యాంటీ బయాటిక్స్ అతిగా వాడటం వల్ల శరీరంలో సహజసిద్ధంగా ఉండే వ్యాధి నియంత్రణ వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. దీనివల్ల సూపర్ బాక్స్ ఏర్పడి ఏ మందు వేసుకున్నా ఫలితం ఉండదన్నారు. ప్రమాదకర యాంటీ బయాటిక్స్ వల్ల శరీరంలో మంచి బాక్టీరియా చనిపోయి రోగనిరోధక వ్యవస్థ బలహీనపడుతుందన్నారు. దీంతో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. వైద్యుల సలహాలు, సూచన లేకుండా యాంటీ బయాటిక్స్ ఎలాంటి పరిస్థితిలో వాడరాదన్నారు. కార్యక్రమంలో ఆర్థో హెచ్‌ఓడీ రామకిషన్, హెచ్‌ఓడీలు రమాదేవి, నవల్ కిశోర్, వైద్యులు లక్ష్మీపద్మప్రియ, అభిలాష, సుజాత, ఆర్ఎంఓ శిరీష పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాలిటెక్నిక్ క్రీడలు ప్రారంభం

- 552 మంది బాలబాలికలు హాజరు



బాలుర కబడ్డీ మహబూబ్‌నగర్ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రిన్సిపాల్స్


క్రీడా జెండాను ఆవిష్కరిస్తున్న అతిథులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో రెండు రోజుల పాటు కొనసాగనున్న ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్, జిల్లా రవాణా అధికారి ఎస్.నరేష్ మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడలతో దేహదారుఢ్యంతో పాటు మానసికంగా ఎదగవచ్చని అన్నారు. ఓడిన వారు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలని కోరారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ చాటాలన్నారు. ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ క్రీడా పోటీల్లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, గద్వాల, కళాశాల, వడ్డేపల్లి, కోస్గి, వనపర్తి, పెబ్బేరు, జేపీఎన్‌సీఈ, స్విట్స్ కళాశాలల నుంచి 301 మంది బాలురు, 251 మంది బాలికలు హాజరయ్యారు. వీరికి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్, వనపర్తి, కోస్గి పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్ నాగరాజు, చంద్రశేఖర్, పరమేశ్వరి, ఇన్‌చార్జ్ పీడీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు పాలిటెక్నిక్ క్రీడల ఫలితాలు...

ఉమ్మడి జిల్లాస్థాయి పాలిటెక్నిక్ క్రీడా పోటీల్లో ఆయా కళాశాలల జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. మొదటి రోజు బాలుర విభాగం వాలీబాల్, కబడ్డీలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు విన్నర్‌గా, స్విట్స్ కళాశాలల జట్టు రన్నరప్‌గా, ఖోఖోలో మహబూబ్‌నగర్ కళాశాల విన్నర్, వనపర్తి కళాశాల రన్నరప్‌గా నిలిచాయి. బాలికల విభాగం కబడ్డీలో విన్నర్ పెబ్బేర్, రన్నరప్ వడ్డేపల్లి, వాలీబాల్‌లో విన్నర్ పెబ్బేర్, రన్నరప్ మహబూబ్‌నగర్, ఖోఖోలో విన్నర్ మహబూబ్‌నగర్, రన్నరప్ పెబ్బేర్ జట్లు నిలిచాయి.

ఉద్యమ గొంతుకకు అండగా నిలవాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ది ధర్మపోరాటమని, ఉద్యమ గొంతుకకు బడుగు బలహీన వర్గాలు అండగా నిలవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాధన కోసం ఉద్యోగాన్ని సైతం లెక్కచేయకుండా శ్రీనివాస్‌గౌడ్ పోరాటం చేశారని గుర్తు చేశారు. పాలమూరు అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు అండగా నిలవాల్సిన అవసరముందన్నారు. దక్షిణ తెలంగాణలో ఏకైక బీసీ మంత్రి అయిన శ్రీనివాస్‌గౌడ్ విజయం.. బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం శ్రీనివాస్‌గౌడ్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుల్కచెర్ల శ్రీనివాస్ ముదిరాజ్, కృష్ణ మోహన్ ఉన్నారు.

ఓటు వేసేందుకు కెనడా నుంచి స్వదేశానికి..



మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహబూబ్‌నగర్‌కు చెందిన సాయిరాఘవ కెనడాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఉన్న నేపథ్యంలో ఎలాగైనా తన ఓటు హక్కు వినియోగించుకోవాలని కెనడా నుంచి స్వదేశానికి చేరుకున్నారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన అభివృద్ధిని చూసి ఆశ్చర్యపడిన అతడు.. శుక్రవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేయాలని కాంక్షించారు. కెనడా నుంచి ఓటు వేసేందుకు వచ్చిన యువకుడిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని అభివృద్ధికి అండగా నిలవాలని మంత్రి కోరారు.

ఎన్నికల సిత్రాలు..

పిల్లల్లో తాను ఓ పిల్లాడై..



మదనాపురం మండలం పెద్దతండాలో దేవరకద్ర బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చిన్నారులతో సరదాగా ఫొటో దిగి అందరినీ ఆకట్టుకున్నారు. - మదనాపురం

ఇస్త్రీ కొట్టు.. ఓటు పట్టు



గద్వాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పట్టణంలోని చాకలిగేరిలో గల ఓ ల్యాండ్రీ షాపులో ఇస్త్రీ చేసి ఓట్లను అభ్యర్థించారు. - గద్వాల రూరల్

సెల్ఫీ ప్లీజ్..



దేవరకద్ర మండలం దోకూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా.. సెల్ఫీ దిగేందుకు యువకులు పోటీపడ్డారు. - దేవరకద్ర

ఒట్టు.. నీకే మా ఓటు



కొల్లాపూర్ సెగ్మెంట్‌లోని పాన్‌గల్ మండలం రేమద్దులలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి పలువురు మహిళలు ఒట్టు వేసి ఓటు వేస్తామని చెప్పారు. - కొల్లాపూర్

సమయాభావం.. ఆకలిభారం..



జడ్చర్ల సెగ్మెంట్‌లోని మిడ్జిల్ మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించిన కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి.. సమయాభావంతో బోయిన్‌పల్లి సమీపంలోని రోడ్డుపైనే భోజనం చేశారు. - మిడ్జిల్

ఓట్ల మోత మోగాలి..



మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డోలు వాయిస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. - మక్తల్

అక్కా.. గ్యారంటీలు పక్కా!




నారాయణపేటలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి ఇంటింటి ప్రచారం చేస్తూ ఆరు గ్యారంటీలను ఓటర్లకు వివరించారు. - నారాయణపేట

ఆ సంఖ్య నొక్కండి!

అడ్డాకుల: ఓవైపు పట్టణాలు, గ్రామాల్లో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. మరోవైపు ఓటర్లు ఎవరికి ఓటు వేస్తారనేది తెలుసుకోవడానికి సర్వేలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రచారం, విజయావకాశాలు అందుకునేందుకు, ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములు ఎలా ఉండబోతున్నాయో తెలుసుకునేందుకు మొబైల్ ఫోన్లను వాడుతున్నారు. ఓటర్లకు కొందరు ఫోన్ చేసి, ఎన్నికల్లో మీ నియోజకవర్గం నుంచి ఫలానా వారు ఫలానా గుర్తుపై పోటీ చేస్తున్నారు.. వీరిలో మీరు ఎవరికి ఓటు వేయాలనుకుంటున్నారో ఆ సంఖ్య నొక్కండి అంటూ సర్వే చేస్తున్నారు. ఇందులో కొందరు తమకు నచ్చిన వారి సంఖ్యను నొక్కుతున్నారు. కొందరు తటస్తులు మనకొచ్చిన గొడవెందుకని కాల్ కట్ చేస్తున్నారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లి నచ్చిన వ్యక్తికి రహస్య పద్ధతిలో ఓటు వేస్తామని, ఫోన్ చేసి అడిగితే ఎలా చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. ఓటరు నాడి పట్టేందుకు అభ్యర్థులు చేస్తున్న ప్రయత్నం బాగానే ఉన్నా.. ఓటర్లు మాత్రం అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తెల్లారక ముందే.. ఇళ్ల ముందుకు!



పల్లెల్లో ప్రస్తుతం వరికోతలు ఊపందుకున్నాయి. రైతులు, కూలీలు ఉదయమే వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులకు ఓటర్ల ఇళ్లు తాళం వేసి కనిపిస్తున్నాయి. దీంతో తెల్లారే సరికి ఓటర్ల ఇంటి ముందు వాలిపోతున్నారు. కోడి కూయక ముందే ఓటర్ల వద్దకు చేరి తమ అభ్యర్థికే ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు. సాయంత్రం మళ్లీ వచ్చి కలుస్తాం.. అంటూ మచ్చిక చేసుకుంటున్నారు. సాయంత్రం 6గంటల తర్వాత ఓటర్లను ప్రత్యేకంగా కలిసి మన వైపే ఉండాలని అభ్యర్థిస్తున్నారు. - అడ్డాకుల